క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవం

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అవభృధయాగపూజ, స్థండిల మండలేశ్వరపూజ, హోమం వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ, మహా పూర్ణాహుతి, మహా దీపారాధన, యాత్ర దానం, స్నపనాభిషేక పూజలను అత్యంత వైభవంగా చేపట్టారు.

విరాళం

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు చిత్తూరు నగరం తిమ్మసముద్రానికి చెందిన తులసీకృష్ణ రూ.1,00,116ను ఆలయ ఈవో గురుప్రసాద్‌కు అందజేశారు.

విద్యార్థికి అభినందనలు



నిరంజన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: తిరుపతి జిల్లా ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించిన యువతరంగం పోటీల్లో ప్రతిభ చాటిన పీవీకేఎన్ విద్యార్థి నిరంజన్ను ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి అభినందించారు. ఆ కళాశాలలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్ చదువుతున్న నిరంజన్ స్పాట్ పెయింటింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, కల్చరల్ కో–ఆర్డినేటర్ జయచంద్రుడు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే నిబంధనలు తెలుసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నిత్యబాబు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు పాఠశాల దశలోనే ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకోవాలని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు అన్నారు. నగరంలోని తపోవనం వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. రోడ్డుపై ఉన్న సూచిక బోర్డులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ గీసిన చార్టులను పరిశీలించిన సీఐ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ చక్రధర్, ప్రిన్సిపల్ సాగరిక తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

తవణంపల్లె: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాలు పెట్టాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్లో గురువారం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం పిల్లలకు పులిహోర, టమాటా బజ్జి, కోడిగుడ్డు పెట్టారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభయ్యే ఈ శిబిరంలో కీళ్ల నొప్పులు, మలబద్ధకం, డయాబెటీస్, పక్షవాతం, నరాలు, గుండె, కాలేయ, మొలలు మొదలైన వ్యాధులకు ఉచిత చికిత్సలందించి, మందులు అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 90304 24549ను సంప్రదించాలని కోరారు.

డీఎస్పీగా విజయశేఖర్



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఎస్.వి జయశేఖర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న విజయశేఖర్‌ను చిత్తూరుకు బదిలీ చేస్తూ, ఇటీవల డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

పాలనలో ప్రభుత్వాలు విఫలం

బంగారుపాళెం: ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. సీపీఎం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా పోరు ధర్నా చేపట్టారు. అనంతరం వారు డిప్యూటీ తహసీల్దార్ కల్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, శంకరాచారి, హేమంత్, జయరామిశెట్టి, మంజునాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం నిర్వీర్యం

- ఆర్బీకేలు, సచివాలయ భవనాల నిర్మాణాలు నిలిపివేత
- వివిధ దశల్లో ఆగిన 447 కార్యాలయాలు
- గత ప్రభుత్వ హయాంలో రూ.240 కోట్లతో పనులు



కత్తెరపల్లెలో అర్థంతరంగా ఆగిన సచివాలయ నిర్మాణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన పల్లె ముంగిటకు వచ్చింది. ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో గ్రామా స్వరాజ్యాన్ని సాకారం చేశారు. రేషన్‌తో సహా అన్ని సేవలు ఇంటి వద్దకే అందుబాటులోకి తీసుకొచ్చారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మొదలుకొని అన్ని రకాల సేవలను గ్రామంలో అందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లపై కత్తి కట్టింది. వాటి నిర్మాణాల్ని నిలిపివేయాలని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చింది.

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా..

గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు చేసి నిరాటంకంగా సేవలందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థపై విషం చిమ్ముతున్నారు. గత ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే కక్షతో నిర్మాణంలో ఉన్న భవనాలను, భవన నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. సచివాలయ వ్యవస్థకు వ్యతిరేకం కాదంటూనే భవన నిర్మాణాలను నిలిపివేసి వ్యవస్థను నిర్వీర్యం చేసేలా విషం చిమ్ముతున్నారు. జిల్లాలో అసంపూర్ణంగా ఉన్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను జోలికి వెళ్లవద్దని అధికారులకు ఆదేశాలు అందాయి.

ఎక్కడి పనులు అక్కడే !

గత ప్రభుత్వ హయాంలో గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా అడుగులు పడ్డాయి. అందులో భాగంగా జిల్లాకు 525 సచివాలయ భవనాలు మంజూరు కాగా 335 భవనాలను పూర్తి చేశారు. మొత్తం రూ.188.36 కోట్లకుగాను రూ.134 కోట్ల పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం 503 ఆర్బీకేలు మంజూరు చేయగా, 340 భవనాలను ప్రారంభించారు. రూ.109 కోట్లకు గాను రూ.74.12 ఖర్చు చేశారు. 353 హెల్త్ క్లినిక్‌లకు గాను 159 అందుబాటులోకి తెచ్చారు. మొత్తం రూ.159 కోట్లకు గాను రూ.32.74 కోట్లతో ఆ భవనాలను ప్రారంభించారు. అన్ని ప్రాధాన్యత భవనాలు కలిపి మొత్తం 1381 మంజూరు కాగా అందులో 834 నిర్మించి రూ.240.84 కోట్లు ఖర్చు చేశారు. సచివాలయాల పరంగా 190, ఆర్బీకేలు పరంగా 163, హెల్త్‌క్లినిక్‌ల పరంగా 194 భవనాలు వివిధ దశల్లో కలిపి మొత్తం 547 పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇందులో దాదాపు 100 భవనాలకు సంబంధించి కొన్నింటికి స్థల సమస్యలు, ఇతర కారణాలతో పనులు ప్రారంభంకాని పరిస్థితి. మిగిలిన భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, వాటిని నిలిపివేశారు. ఒక్కొక్క గ్రామ సచివాలయం ద్వారా వేల సంఖ్యలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేవారు. ఏడాదికి సగటున జిల్లా వ్యాప్తంగా సచివాలయాల ద్వారా దాదాపు 5 లక్షల మంది వరకు సిటిజన్ చార్టర్ ద్వారా సేవలు అందుకున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించేవారు. 2019 ముందు వరకు వాటి కోసం మండలాల్లో రైతులు బారులు తీరడం, లాఠీచార్జులు జరిగిన పరిస్థితి ఉండేది. వాటన్నింటికి రైతు భరోసా కేంద్రాల ద్వారా పరిష్కారం లభించింది. ధాన్యం కొనుగోలు కూడా రైతు భరోసా కేంద్రాల నుంచి నిర్వహించారు. ప్రస్తుతం దశలవారీగా వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.



ఐరాలలో ప్రారంభానికి నోచుకోని వైఎస్సార్ హెల్త్‌క్లినిక్



పెనుమూరులో పూర్తి కాని హెల్త్‌క్లినిక్ నిర్మాణం



ఎస్ఆర్ పురంలో ఆగిపోయిన రైతు భరోసా కేంద్ర నిర్మాణం

ఒంటిల్లులో ఆరోగ్య శిబిరం

కాణిపాకం: చిత్తూరు నగరంలోని ఒంటిల్లులో అపోలో నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. తొలుత మధుమేహ వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తర్వాత వైద్య బృందం జాన్, అశోక్‌కుమార్, శివరామకృష్ణ, అమర్‌నాథ్, జయంతి ప్రజలను పరీక్షించి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని 73 మంది సద్వినియోగం చేసుకున్నట్లు వైద్య బృందం తెలిపింది.

మెరుగైన వైద్య సేవలు



రక్త పరీక్ష చేస్తున్న జిల్లా స్టాటిస్టికల్ అధికారి జార్జ్

ఐరాల: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి జిల్లా స్టాటిస్టికల్ అధికారి జార్జ్ సూచించారు. మండలంలోని నాగంవాండ్లపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు సందర్శించారు. పలు రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు. హెచ్‌ఎంఐఎస్ ఆన్‌లైన్‌లో అనుసంధానించి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేసి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి పీహెచ్‌సీకి రెఫర్ చేసే బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ రామ్మోహన్, పీఎంఎంవీవై మంజునాథ్, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, సీహెచ్ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం షాహీన, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో శిక్షణ



ఫైరింగ్ నేర్చుకుంటున్న ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్: ఫైరింగ్‌లో ప్రతి ఎన్‌సీసీ కేడెట్ మెలకువలను తెలుసుకోవాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిస్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్‌లో విద్యార్థులకు ఫైరింగ్ శిక్షణలో మెలకువలు నేర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కేడెట్ తప్పనిసరిగా ఐదు రౌండ్లు ఫైరింగ్‌ను నేర్చుకోవాలన్నారు. ఎన్‌సీసీలో ఉత్తమ శిక్షణతోపాటు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం ఫైరింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు మహేష్, ప్రసాద్‌రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

సహకార జెండా ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయ ఆవరణలో గురువారం ఏడు రంగుల సహకార జెండాను ఆవిష్కరించారు. జిల్లా సహకార శాఖ అధికారి నాగవర్ధన, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, విభాగ సహకార అధికారి వనజ జెండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ సహకార రంగం మరింత బలోపేతం కావడానికి సహకార రంగ సిబ్బంది కృషి చేయాలన్నారు. సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన వంటి అంశాలను వివరించారు.

ఉద్యోగాలకు 40 మంది ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ మేళాలో 40 మంది విద్యార్థులు ప్రతిభ సాధించి ఉద్యోగాలకు ఎంపికైనట్లు సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి తెలిపారు. నగర సరిహద్దులో గురువారం మురకంబట్టు వద్ద ఉన్న ఆ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేశారు. ఎంపికైన 40 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రంగనాథం, డీన్ శరవణన్, ఆర్‌అండ్‌డీ డీన్ సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంత దూరం వెతికినా ఆహారం దొరకడంలేదని క్యూలో కూచుని నిరీక్షించినట్లుగా ఉంది ఈ కొంగల గుంపు చూస్తే.. కొంగలన్నీ రాతికూసాలపై కూర్చుని ఉన్న ఈ చిత్రం మండలంలోని తగ్గువారిపల్లె కామాక్షమ్మకుంట వద్ద గురువారం కనిపించింది. -బంగారుపాళెం

జాగ్రత్తలతో క్యాన్సర్‌కు చెక్

ఐరాల: ప్రజలు ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పలు గ్రామాల్లో 136 మందికి ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు



టెస్ట్‌లు చేస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమవుతుందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. బట్టువాళ్లూరు గ్రామంలో గురువారం ఎన్సీడీ 3.0 అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 5 కుటుంబాలను ఎంచుకొని ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరికీ హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, ఏఎన్ఎమ్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లెలో వైద్యసేవలు

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమహేష్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణు లు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యసిబ్బంది సునిత, మోహన, అనిత, ఎలవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బడుల్లో ఘనంగా బాలల దినోత్సవం





బంగారుపాళెం, తవణంపల్లె పాఠశాలల్లో బాలల దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బంగారుపాళెం/తవణంపల్లె: మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులర్పించారు. బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు కేక్ కట్‌చేసి పిల్లలకు పంచి పెట్టారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని బృందావన్ సీబీఎస్ఈ పాఠశాల చైర్పర్సన్ శైలజ అన్నారు. గురువారం సంతపేటలోని ఆ పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు.



వివిధ వేషధారణలో విచ్చేసిన బృందావన్ పాఠశాల విద్యార్థులు

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం ఉన్నత విద్య చదివే విద్యార్థులకు అన్యాయం జరగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకులు మిట్టూరులోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో జిల్లా మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలను కేంద్రం పరిష్కరించాలన్నారు. ఫెలోషిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు. తిరుపతి జిల్లా ఎస్వీ యూనివర్సిటీలో విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతూ మెస్‌బిల్లుల పేరుతో ప్రతి విద్యార్థి నుంచి నెలకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ అక్రమ వసూళ్లను ఆపకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో 49 ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి, చలపతి, కార్మిక నాయకుడు నాగరాజు, జిల్లా కన్వీనర్ ప్రవీణ్, మున్నా పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీ



బంగారుపాళెం: గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు, గ్రంథాలయాధికారి

చిత్తూరు కార్పొరేషన్: నిత్యం పుస్తక పఠనంతో జ్ఞానం వస్తుందని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాలు పాత గ్రంథాలయ భవనం వద్ద ప్రారంభమయ్యాయి. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ మొదటి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు. చిన్నతనంలో గ్రంథాలయాలతో ఉన్న అనుబంధాలను ఆర్డీఓ పిల్లలకు తెలియజేశారు. చివరిగా వారోత్సవాల నిర్వహణ కోసం మాజీ కార్పొరేటర్ పార్థసారథినాయుడు రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ, ఉప గ్రంథాలయాధికారి లలిత, పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన బాంఢాగారాలు

బంగారుపాళెం: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే బాంఢాగారాలని ఎంఈఓలు నాగేశ్వర్ రావు, ఎంఈఓ–2 రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు ఈ నెల 20వ తేదీ బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనంజయరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్తూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

- చదువుకుందాం.. జ్ఞానం పెంచుకుందాం!
- ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు
- వారం పాటు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహణ

చిత్తూరు కార్పొరేషన్: నిత్యం పుస్తక పఠనం చేయడం వల్ల పలు విషయాలు తెలియడంతో పాటు జ్ఞానం వస్తుంది. ఎంతో మంది మహనీయులు పుస్తకాలే తమ మార్గదర్శి అని పలు సందర్భాల్లో చెప్పుకున్నారు. ప్రతి ఏటా నవంబర్‌లో నిర్వహించే వారోత్సవాలకు గ్రంథాలయాలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆదేశాల మేరకు అన్ని గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. వారం రోజుల పాటు విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ రకాల అంశాలపై పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. సమీప గ్రంథాలయాలకు దగ్గరలో ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈ వారోత్సవాల్లో పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉన్నతాధికారులు సూచించారు. రోటరీ, లయన్స్, స్వచ్ఛంద సేవా సంస్థలు, జన విజ్ఞానవేదిక సేవలకు అవకాశం కల్పించారు.

కార్యక్రమాలు ఇలా..

- 14వ తేదీ గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతోపాటు నెహ్రూ జయంతి వేడుకల నిర్వహణ
- 15న శుక్రవారం పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత
- 16న శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు ఆర్ ఎస్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెంకటరమణ వంటి ప్రముఖుల విశేషాల వివరణ
- 17న ఆదివారం రచయితల సందేశాలు, కవి సమ్మేళనాలు
- 18న సోమవారం విద్యార్థులకు వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాస రచన, క్విజ్, క్రీడల పోటీలు, (ముఖ్యంగా గ్రంథాలయాల పాత్ర, నిర్వహణ, ఉపయోగాలు)
- 19న మంగళవారం మహిళలకు రంగవల్లులు, అల్లికల పోటీలు
- 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, ×చదువంటే మాకిష్టం× ప్రాధాన్యత, విజేతలు బహుమతుల ప్రదానం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు



జిల్లా గ్రంథాలయం

జిల్లా గ్రంథాలయ సమాచారం

జిల్లాలో కేంద్ర గ్రంథాలయం–1, శాఖా గ్రంథాలయాలు–71, పుస్తక నిక్షిప్త కేంద్రాలు–105 ఉండగా 71,400 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఏటా 13,16,000 మంది సందర్శిస్తున్నారు. 1.6 లక్షల మంది పుస్తకాలు ఇంటికి తీసుకొని వెళుతున్నారు. రోజు దాదాపు 3000 మంది పాఠకులు సందర్శిస్తున్నారు. నామమాత్రపు రుసుం రూ.10తో గంటసేపు ఇంటర్‌నెట్ సేవలు అందించనున్నారు.

వినియోగించుకోవాలి



గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, పాఠకులు, విద్యావేత్తలు, కవులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలి. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నాం. వారం పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

–శర్మ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి